క్లుప్తంగా

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు



ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి జాయినింగ్ ఆర్డర్లు ఇస్తున్న ఎంఈఓలు

సామర్లకోట: డీఎస్సీలో విజయం సాధించి, శిక్షణ పూర్తి చేసుకున్న పది మంది ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరిన్నట్టు మండల విద్యాశాఖాధికారులు వై. శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య తెలిపారు. విధుల్లో చేరడానికి వచ్చిన ఉపాధ్యాయులకు పాఠశాలలను కేటాయించినట్టు వారు తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ బయాలాజికల్ సైన్సు విభాగానికి ఎంపికైన ఉపాధ్యాయులను తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్ లోను, స్కూల్ అసిస్టెంట్ సోషల్‌కు సంబంధించిఎంపికై న వారిని అయోధ్యరామపురం మున్సిపల్ హైస్కూల్ లోను, స్కూల్ అసిస్టెంట్ పీడీ అంశానికి ఎంపికైన వారిని మండలంలో మేడపాడు జిల్లా పరిషత్తు హైస్కూల్ జాయినింగ్ ఆర్డర్లు ఇచ్చినట్టు ఎంఈఓలు తెలిపారు. అదే విధంగా పట్టణ పరిధిలోని జగ్గమ్మగారిపేట ఎలిమెంటరీ పాఠశాలలో ఒక ఎస్‌జీటీ, కొత్తూరు ఎలిమెంటరీ పాఠశాలలో ఒక ఎస్‌జీటీ, బలుసులపేట ఎలిమెంటరీ పాఠశాలలో ఒక ఎస్‌జీటీ, తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో నలుగురు ఎస్‌జీటీలకు ఆర్డర్లు ఇచ్చినట్టు తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

సామర్లకోట: ఆన్‌లైన్ మోసాలతో ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల బ్యాంకుల నుంచి రుణాలు ఇస్తామని, బహుమతులు వస్తాయని సెల్‌పోన్‌లకు వచ్చే మెసేజ్‌లకు దూరంగా ఉండాలన్నారు.

హుండీ ఆదాయం రూ.6.07 లక్షలు



హుండీల సొమ్ములను లెక్కిస్తున్న భక్తులు, ఆలయ సిబ్బంది, అధికారులు

కాకినాడ రూరల్: సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి ఆలయంలో హుండీలను సోమవారం దేవదాయశాఖ అధికారులు లెక్కించగా ఏడు నెలలకు గాను రూ.6,07,574 ఆదాయం లభించినట్టు ఈఓ టీవీ సూర్యనారాయణ తెలియజేశారు. దేవదాయ శాఖ తనిఖీదారు వి.ఫణీంద్రకుమార్, ఈవోలు వీరభద్రరావు, వేణుగోపాలరావు పర్యవేక్షణలో గ్రామస్తులు, భక్తులు, సిబ్బంది ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు హుండీల్లోని ఆదాయం లెక్కించినట్టు ఆయన తెలిపారు.

విద్యార్థులకు నగదు బహుమతులు



విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

బాలాజీచెరువు: నిట్ కాలికట్ నిర్వహించిన ఇన్ఫినిటమ్ పోటీల్లో ఆదిత్య విద్యార్థులు ప్రతిభ చూపారు. గంగరాజునగర్ ఉన్నత పాఠశాల పదో తరగతికి చెందిన మానెజె సమర్థ, మన్యం సాయిఅభినవ్ ప్రతిభ సాధించి 25వేల నగదు బహుమతిని సొంత చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ నల్లమిల్లి దీపక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మొయినాలు అభినందించారు.

ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలి



గృహోపకరణాలను అందజేస్తున్న వేంకటేశ్వరరావు

బాలాజీచెరువు: ప్రతి ఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలని హెల్త్ అవేర్‌నెస్ సంస్థ అధ్యక్షుడు చప్పిడి వెంకటేశ్వరావు పేర్కొన్నారు. అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ పెంకే గోవిందరాజు ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమంలో భాగంగా రజనీగౌరి అనే మహిళలకు గృహోపకరణ వస్తువులు అందజేశారు. పేద కుటుంబానికి చెందిన మహిళలకు వివాహ నిమిత్తం సాంప్రదాయంగా పెట్టే గృహోపకరణ వస్తువులు సాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సౌత్ ఇండియా మల్టీపుల్ కౌన్సెల్ కార్యదర్శి వనుం శ్రీనివాసరావు, క్యాబినెట్ కార్యదర్శి పెంకేశివప్రసాద్, కాకరపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై ఉద్యమం

- పెద్దాపురం, పిఠాపురం నియోజకవర్గాలలో నిరసనలు
- ర్యాలీగా తరలి వెళ్లిన వైఎస్సార్ సీపీ నాయకులు
- ఎక్సైజ్ అధికారులను నిలదీసిన మహిళలు



పెద్దాపురం ఎక్సైజ్ కార్యాలయం వద్ద దొరబాబు ఆధ్వర్యంలో ధర్నా



పిఠాపురం ఎక్సైజ్ కార్యాలయం వద్ద వంగా గీత ఆధ్వర్యంలో ధర్నా

సామర్లకోట: నకిలీ మద్యం తయారీ, విక్రయాలకు వ్యతిరేకంగా పెద్దాపురం, పిఠాపురం నియోజకవర్గాలలో నిరసన జోరు హోరెత్తింది. ప్రజలకు అండగా వైఎస్సార్ సీపీ ఉద్యమ బాట పట్టింది. పార్టీ శ్రేణులు నిరసన తెలిపాయి. వర్షంలోను ఆయా పార్టీ కార్యాలయాల నుంచి ర్యాలీగా ఎక్సైజ్ కార్యాలయాలకు చేరుకొని నిరసన తెలియజేస్తూ ధర్నాలు నిర్వహించారు. పెద్దాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో సామర్లకోటలోని పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా తరలి వెళ్లారు. సామర్లకోట–పెద్దాపురం రోడ్డు నుంచి పాదయాత్రగా నకిలీ మద్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకున్నారు. ఎక్సైజ్ కార్యాలయం వద్ద మహిళలు అధికారులను నిలదీశారు. వరి పంటకు ఎరువుల వాడకం వలన హాని జరుగు తుందని ప్రచారం చేస్తున్న చంద్రబాబుకు నకిలీ మద్యం వలన ప్రాణాలు పోతాయనే విషయం తెలియాదా అని ఎక్సైజ్ అధికారులను ప్రశ్నించారు. నారా వారి నకిలీ మద్యం అరికట్టాలని, బెల్టు షాపులను రద్దు చేయాలని నినాదాలు చేశారు. పెద్దాపురం పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్సైజ్ సీఐ కెవీవీ దుర్గార్జునరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దవులూరి దొరబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మద్యంను ఏరులై పారిస్తూ నారా వారి కల్తీ మందు కుటీర పరిశ్రమగా రాష్ట్రం ప్రతి ప్రాంతంలో తయారు చేసి మద్యం షాపులలోను ఈ మద్యం విక్రయం చేస్తున్నారని ఆరోపించారు. ఈ మద్యంను సేవించిన అనేక మంది అనారోగ్యానికి గురి కావడంతో పాటు ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకు వెళ్లడానికి సామర్లకోట నుంచి పెద్దాపురం వరకు ర్యాలీ నిర్వహించి ఎక్సైజ్ అధికారులకు నకిలీ మద్యం అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశామన్నారు. దొరబాబు మాట్లాడుతూ ఎఎస్సార్ సీపీ పాలనలో ఎటువంటి అవకతవకలు జరుగకపోయినా స్కామ్ జరిగిందని తప్పుడు కేసులు నమోదు చేశారని గుర్తు చేశారు. అధికారంలోనికి వచ్చిన తరువాత మద్యంను వారే తయారు చేసే ప్రభుత్వ ఖజానికి గండి కొడుతున్నారన్నారు. ప్రజల ఆరోగ్యానికి నష్టం కలిగిన విషయంపై సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాని గమనిం చారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వాని గమనిస్తున్నారని తెలిపారు. సుపరిపాలన కోసం తిరిగి వైఎస్సార్‌సీపీ పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు, సామర్లకోట ఇన్‌చార్జి చైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవి, వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గోపు మురళీ, జిల్లా ప్రధాన కార్యదర్శి బందారు వీరబాబు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు ఇరుసుమళ్ల సాయి, నియోజకవర్గ జిల్లా పరిషత్ వింగ్ అధ్యక్షుడు నాగనబోయన రాజబాబు, నియోజకవర్గ మహిళా అధ్యక్షరాలు సేపెని రూప, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ వారా సుధాకర్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ తల్సికి సత్యభాస్కరరావు, పట్టణాల అధ్యక్షులు పాగా సురేష్‌కుమార్, కాపుగంటి కామేశ్వరరావు, మహిళా అధ్యక్షరాలు పాలిక కుసుమ, మండల పార్టీ అధ్యక్షుడు తలారి దొరబాబు, పెద్దాపురం వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యురాలు యేలేటి అనంతలక్ష్మీచౌదరి, రెండు మున్సిపాలిటీల కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సామర్లకోట నుంచి మోటారు సైకిళ్లతో ర్యాలీగా పెద్దాపురం తరలిన దొరబాబు తదితరులు



పెద్దాపురం ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేస్తున్న దొరబాబు, మహిళలు

పిఠాపురంలో నిరసన హోరు

మాజీ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ వంగా గీత ఆధ్వర్యంలో నిర్వహించిన నకిలీ మద్యం నిరసన హోరెత్తింది. నకిలీ మద్యాన్ని వెంటనే అరికట్టాలని, ఆ మద్యం తయారుదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నకిలీ మద్యం ద్వారా ప్రాణాలు కోల్పోయిన వారిని ఆదుకోవాలని నినాదాలు చేశారు. పిఠాపురం కార్యాలయం నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ మేరకు గీత రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ మేరకు ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వంగా గీత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నకిలీ మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకొని పాలన సాగిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున స్థావరాలు ఏర్పాటు చేసుకుని నకిలీ మద్యాన్ని తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుందని ధ్వజమెత్తారు. జగన్ మోహన్‌రెడ్డి పాలనలో మద్యం షాపులు నిబంధన మేరకే నిర్వాహణ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు గండేపల్లి రామారావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బత్తుల సాయి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షరాలు వరిసీటి సుజాత, పార్టీ పటణ అధ్యక్షుడు రావుల మాధవరావు, పార్టీ నాయకులు కొత్తెం దతుడు, జవ్వాది కృష్ణమాధవరావు, ఉలవల భూషణం, వజ్రపు వీరేష్, బాబీ, ముమ్మిడి శ్రీను, కొత్తపల్లి మండల అధ్యక్షుడుఆనాల సుదర్శన్, పిఠాపురం అధ్యక్షుడు అడపా రాఘు, జెడ్పీటీసీ సభ్యుడు ఉలవకాయల లోవరాజు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



పంచారామ క్షేత్రంలోని కుమారా రామ భీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి ప్రీతైన రోజు సోమవారం కావడంతో ఆలయంలోని కుమారా రామ భీమేశ్వరస్వామి వారికి, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఉప ఆలయాలోను అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి స్వామి వారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తొలి అభిషేకం తిలకించడానికి క్యూలలో భక్తులు వేచి ఉన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ధ్వజస్థంబం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరణిలోని నీటితో స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఉదయం పులిహోర ప్రసాదంగాను, మధ్యాహ్న అన్నప్రసాదం, సాయంత్రం శనగలు, పులిహోర ప్రసాదంగా ఏర్పాటు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అళ్లకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజలు అనంతరం స్వామి వారికి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. అదే విధంగా స్థానిక మఠంసెంటర్‌లోని రామలింగేశ్వర స్వామి ఆలయంలోను, గొంచాలలో ఉన్న శివాలయంలోను, పీబీ దేవం శివాలయంలోను, పెద్దాపురం పట్టణ, మండల పరిధిలోని శివాలయాలోను పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

అవిశ్వాసానికి రంగం సిద్ధం

- బలనిరూపణకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలి
- కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాలు



కలెక్టర్ షణ్మోహన్ సగిలికి వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

సామర్లకోట: పట్టణ మున్సిపల్ కౌన్సిల్ బలనిరూపణకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీకి చెందిన కౌన్సిలర్లు సోమవారం కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలికి వినతిపత్రం అందజేశారు. గత కొంత కాలంగా చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ తీరుపై అదే పార్టీకి చెందిన కౌన్సిలర్లు అసంపూర్తితో ఉన్నారు. దీంతో ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీన అవిశ్వాస తీర్మానానికి అవకాశం ఇవ్వాలని కలెక్టరుకు వినతిపత్రం అందజేయడంతో మే 25న అవిశ్వాస తీర్మానానికి ఏర్పాటు చేయగా అవిశ్వాస తీర్మానం ఆమోదం పొందింది. విషయం తెలుసుకున్న చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కోర్టును ఆశ్రయించారు. దాంతో అవిశ్వాస తీర్మానానికి అధ్యక్షత వహించిన కాకినాడ ఆర్డీఓ మల్లిబాబు కోర్టులో వివాదం ఉన్న కారణంగా అవిశ్వాసాన్ని ప్రకటించలేదు. ఈ మేరకు ఇటీవల హైకోర్టు తిరిగి అవిశ్వాస తీర్మాన సమావేశం ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. దాంతో సొంత పార్టీకి చెందిన కౌన్సిల్ సభ్యులలో 23 మంది సంతకాలు చేసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అవిశ్వాసం తీర్మానానికి అవకాశం ఇవ్వాలని సోమవారం కలెక్టరుకు వినతి పత్రం అందజేశారు. కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీసత్యనారాయణ, గుబ్బల సత్యనారాయణ వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్నం దొరబాబు, రెడ్డి శ్రీనివాసు, పెదిరెడ్ల కృష్ణ పాల్గొన్నారు.

మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీల్లో నాని ప్రతిభ



స్విమ్మింగ్ పోటీల్లో పతకాలు సాధించిన నాని

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): మంగళగిరిలో ఈ నెల 11, 12 తేదీల్లో జరిగిన 7వ మాస్టర్స్ మహబూబ్ షంషేర్ ఖాన్ స్మారక స్విమ్మింగ్ పోటీల్లో కాకినాడకు చెందిన స్విమ్మింగ్ క్రీడాకారుడు నాని ప్రతిభను కనబర్చారు. 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్‌లో బంగారు, 50 మీటర్ల బటర్ ఫ్లైలో రజత, 50 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో కాంస్య పతకాలు సాధించాడు. ఈపోటీల్లో తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్, ఏపీ నుంచి క్రీడాకారులు పాల్గొన్నారని నాని తెలిపాడు.

బాలికల హక్కులను కాపాడుకోవాలి

జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ దుర్గారాణి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ దుర్గారాణి

పిఠాపురం: బాలికల హక్కులను కాపాడుకోవాలని వారిపై ఉన్న లింగ అసమానతలను తొలగించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి సూచించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి ఆదేశాల మేరకు పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ దుర్గాదేవి ఆధ్వర్యంలో పిఠాపురం జగ్గయ్య చెరువు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాలలో సోమవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పిఠాపురం, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంయుక్తంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఒక్కో అంశంపై అవగాహన కల్పిస్తున్నామని, ఈఏడాది 'బాలికగా నాతోనే మార్పు – రండి ముందుకు' అనే అంశంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలు, విద్య, పోషణ, చట్ట పరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, హింస, బలవంతపు బాల్య వివాహం, వివక్షతపై అవగాహన కల్పించారు. బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను, బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలను నివారించి, వారి హక్కులను తెలియ జేసేందుకు ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని ప్రకటించిందన్నారు. అక్టోబర్ 11వ తేదీ నుంచి 18వ తేదీ వరకు వారోత్సవాలు జరగనున్నాయన్నారు. పాఠశాలలలో బాలికలకు వ్యాసరచన పోటీలు ఆటపాటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్‌కే అరుణ, గురుకులం ప్రిన్సిపాల్ పి.సుజాత, స్టాఫ్ నర్స్ సీహెచ్ సుసన్న, తెలుగు టీచర్ శాంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు టి.వెంకటలక్ష్మి, పి.నాగమణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాకీ బాధలు తప్పించండి మహాప్రభో

చేబ్రోలులో డ్రైన్లు లేక ఇళ్లలోకి చేరుతున్న వర్షపు నీరు

చేబ్రోలుపిఠాపురం: ఇటీవల స్వచ్ఛ గ్రామ పంచాయతీగా అవార్డు పొందిన చేబ్రోలులో డ్రైన్లు లేక వర్షపు నీరు ఇళ్లలోకి చేరి స్థానికులు నరకం చూస్తున్నారు. డ్రైనేజీ సదుపాయం కల్పించండి మహాప్రభో అంటూ స్థానికులు అనేక మార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకునే నాథుడు లేరని స్థానికులు వాపోతున్నారు.

చేబ్రోలు మార్కెట్ వీధిలో డ్రైన్లు లేకపోవడంతో చిన్న పాటి వర్షం కురిసినా నీరు వెళ్లే మార్గం లేక రోడ్లపై నిల్వ ఉండి ఇళ్లలోకి చేరుతున్నట్టు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వార్షలు పడుతుండడంతో నీరంతా ఇళ్లలోకి చేరి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకుని తమ సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



చేబ్రోలు మార్కెట్ వీధిలో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు



చేబ్రోలులో ఓ ఇంటిలో చేరిన మురుగు నీరు



చేబ్రోలులో ఇంటి వద్ద నిలిచిన నీరు

నిరుపయోగంగా రైతు సేవా కేంద్రం

- భవనం ప్రారంభించకుండానే బీటలు
- చెమ్మదేరుతున్న గోడలు
- నిర్మాణం పనులు పూర్తి కాకుండానే రంగులు
- పట్టించుకోని అధికారులు



కొండెవరంలో నిర్మించిన రైతు సేవా కేంద్రం



ప్రారంభించకుండానే బీటలు వారిన రైతు సేవా కేంద్రం



వర్షానికి లీకై చెమ్మదేరుతున్న శ్లాబ్

కొత్తపల్లి: రైతులకు తమ సొంత గ్రామంలోనే సేవలను అందించానే ఉద్దేశంతో గత ప్రభుత్వంలో ప్రతి గ్రామంలోనూ రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాటి కోసం భవనాలు కూడా నిర్మించింది. పలు గ్రామాల్లో భవన నిర్మాణాలు పూర్తి కాగా వాటిని ప్రారంభించి, సేవలను అందిస్తున్నారు. మండలంలోని కొండెవరం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్మించిన రైతు సేవా కేంద్రం-1 ప్రారంభించకుండానే బీటలు వారింది. వర్షం పడితే నీరు లీకవుతోంది. భవనం వెనుక ప్లాస్టింగ్ చేయకుండానే రంగులు వేసేశారు. పట్టించుకోవాల్సిన సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో పడి పట్టించుకోవడంలేదని ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. నిర్మించిన భవనం రైతులకు ఉపయోగపడకుండా నిరుపయోగంగా ఉంది. దీనిపై మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాస్‌ను వివరణ కోరగా భవనాన్ని రూ.40 లక్షలతో నిర్మించామన్నారు. భవనానికి సంబంధించి విడతల వారీగా రూ.37.26 లక్షలు బిల్లులు చేస్తామన్నారు. ఇంకా మిగిలిన బిల్లులు రూ.2.74 లక్షలను బిల్లులు ఇవ్వాల్సి ఉందన్నారు. అంతా పూర్తయిన తరువాతే మిగిలిన బిల్లులు చేస్తామన్నారు. భవన నిర్మాణంలో ఎటువంటి నాణ్యతా ప్రమాణాలు లేకపోయినా బిల్లులు నిలిపివేశామన్నారు.

పీసీ పీఎన్‌డీటీ చట్టంపై అవగాహన

కాకినాడ క్రైం: గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టంపై సోమవారం నుంచి అవగాహన వారోత్సవాలు ప్రారంభించినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించనున్నామన్నారు. విద్యార్థినులకు ఈ చట్టంపై లోతైన అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. జిల్లా టీకాల అధికారి డాక్టర్ కేవీ సుబ్బరాజు కార్యక్రమ ఉద్దేశాలను వివరించారు. చట్టం పటిష్టంగా అమలు చేస్తుండడం వల్ల జిల్లాలో లింగ ఆధారిత గర్భపాతాలు నివారించవచ్చన్నారు. స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు గుర్తిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1800 425 3365 లేదా 94941 13365 నంబర్లకు సమాచారం ఇవ్వాలని, ఫిర్యాదుదారు వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.